క్లుప్తంగా

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

మార్కెట్ కమిటీ డైరెక్టర్ భాస్కర్‌గౌడ్



స్లాబ్ పనులను ప్రారంభిస్తున్న నాయకులు

కేశంపేట: కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని మార్కెట్ కమిటీ డైరెక్టర్ భాస్కర్‌గౌడ్ అన్నారు. మండల పరిధిలోని నిర్దవెళ్లిలో శనివారం ఎస్సీ భవన స్లాబ్ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో సబ్బండ వర్గాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల్లో అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తుందని ఆయన గుర్తుచేశారు. గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యల పరిష్కారానికి భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శ్రీశైలం, వెంకట్‌రెడ్డి, ముత్యాలు, జంగయ్య, రాజేందర్, మల్లయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంక్రీట్ వేసి... కల్వర్టును మూసి



కల్వర్టును మూసివేస్తూ చేపడుతున్న కాంక్రీట్ నిర్మాణం

మొయినాబాద్: వర్షం పడినప్పుడు వరదనీరు వెళ్లేందుకు నిర్మించిన కల్వర్టులను కొందరు అక్రమార్కులు అడ్డంగా మూసివేస్తున్నారు. ఇప్పటికే కొన్నిచోట్ల వాటిని మూసివేయడంతో వరదనీరు రోడ్లపై నిలుస్తోంది.అదే తరహాలో మళ్లీ మున్సిపాలిటీ పరిధిలోని అమ్డాపూర్ చౌరస్తా సమీపంలో హైదరాబాద్‌-బీజాపూర్ జాతీయ రహదారిపై ఉన్న ఓ కల్వర్టును కాంక్రీట్ వేసి మూసివేస్తున్నారు. దయాల్ గార్డెన్‌లో ప్లాట్ కొనుగోలు చేసిన వ్యక్తి ఎదుట ఉన్న కల్వర్టును పూర్తిగా కాంక్రీట్‌తో మూసివేశారు. వర్షం పడినప్పుడు పైనుంచి దయాల్ గార్డెన్‌వైపు వరద నీరు వెళ్లేందుకు కల్వర్టు నిర్మించారు. ఈ కల్వర్టుకు అడ్డంగా గోడ నిర్మించి కాంక్రీట్ వేశారు. కల్వర్టు పైపు ఉన్నచోట మాత్రం ఓ ఇనుప గ్రిల్లు పెట్టారు. కల్వర్టును మూసివేయడంతో వరదనీరు రోడ్డుపై నిలిచే అవకాశం ఉంది. అధికారులు స్పందించి కాంక్రీట్ నిర్మాణాన్ని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

ఉచిత వైద్య శిబిరం



చందనవెళ్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, గ్రామస్తులు

షాబాద్: పుట్టిన ఆరు సంవత్సరాలలోపు పిల్లల్లో ఆలోచన, జ్ఞాపకశక్తి, భాష సమస్య పరిష్కార నైపుణ్యాలను తెలుసుకోవడానికి స్కానింగ్ చేయడం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చేవెళ్ల స్వామి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని చందనవెళ్లిలో మైక్రోసాఫ్ట్ వారి సహకారంతో యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్, చందనవెళ్లి వీడీసీ అడ్వైజర్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆరు సంవత్సరాలలోపు పిల్లలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో 60 మంది పిల్లలకు టెస్టులు చేసి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. పిల్లల ఆరోగ్యంపై స్వచ్ఛంద సంస్థలు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు శ్రావణ్‌కుమార్, శ్రీదేవి, యశ్వంత్, సుబ్బారావు, గ్రామ వీడీసీ సభ్యులు శ్రీకాంత్, వెంకటేశ్, యునైటెడ్ వే ఆఫ్ సంస్థ ప్రతినిధులు మహేశ్వరి, లక్ష్మీనారాయణ, రవితేజ, సద్దాం హుస్సేన్, హేమంత్ కుమార్, శ్రీనివాసులు, పవన్‌కుమార్, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

అల్లనేరేడు.. లాభాలు బోలెడు

విరివిగా లభించే పండ్లు
- తింటే పలు రకాల వ్యాధులు దూరం
- మధుమేహ వ్యాధిగ్రస్తులకు దివ్యౌషధం
- మార్కెట్‌లో మంచి డిమాండ్



అల్లనేరేడు పండ్లు

షాబాద్: సీజనల్‌గా వచ్చే అల్లనేరేడు పండ్ల అమ్మకాలు జోరందుకున్నాయి. తియ్యదనం, పులుపు, వగరు మేలు కలయికే అల్లనేరేడు. నల్లగా నిగనిగలాడే ఆ పండ్లను చూస్తే ఎవరికైనా నోరూరాల్సిందే. సహజ సిద్ధంగా లభించే ఫలాల్లో అల్లనేరేడు ఒకటి. వాటిలో ఔషధ లక్షణాలు ఎక్కువగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. డయాబెటిస్(మధుమేహ) రోగులకు ఇది చేసే మేలు ఎంతో. శరీరంలోని చక్కెరస్థాయి నియంత్రణలో ఉంటుంది. సీజన్‌లో ప్రతి ఒక్కరూ రోజుకు కనీసం పది పండ్లయినా తింటే ఎంతో మంచిది. కిడ్నీ వ్యాధులను అల్లనేరేడు నయం చేస్తుంది. చిన్నసైజు రాళ్లుంటే ఈ పండ్లు ఎక్కువగా తింటే కరిగిపోయే అవకాశం ఉంది. ఇలా ఒకటి, రెండు వ్యాధులకే కాకుండా మల్టీ విటమిన్ గల ఈ ఫ్రూట్ ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ధర ఎంత ఉన్నా ఈ పండు తినగం అందరికీ ఎంతో మంచిది. ప్రకృతిలో లభించే పండ్లు ఎన్ని ఉన్నా సరే సినీ, జానపద గేయ రచయితలు మాత్రం అల్లనేరేడు పండ్లపై పాటల రూపంలో బాణీలు కట్టడం విశేషం.

పలువురికి ఉపాధి..

ప్రతీ ఏడాది ఏప్రిల్ నెలలో పూత కాత మొదలై జూన్, జూలై వరకు పండ్లు పుష్కలంగా లభిస్తాయి. సేను సెలకల్లో సహజ సిద్ధంగా దొరికే అల్లనేరేడు పండ్లతో కొందరికి మంచి ఉపాధిగా మారుతోంది. మార్కెట్లో విరివిగా లభించే అల్లనేరేడు పండ్లకు మంచి డిమాండ్ ఏర్పడుతుంది. ఒక్క పండులోనే కాకుండా అల్లనేరేడు ఆకులు, బెరడులో కూడా మంచి ఔషధ పోషకాలు నిక్షిప్తమై ఉన్నాయని డాక్టర్లు చెబుతున్నారు. పండ్లలో ఆమ్లాలు, విటమిన్లు, సోడియం, పొటాషియం, ఐరన్ వంటి పోషకాలు మెండుగా ఉంటాయి. పండ్లల్లో ఐరన్ పుష్కలంగా ఉండడంతో రక్తాన్ని శుద్ధి చేయడమే కాకుండా రక్తహీనతను తగ్గిస్తాయి. ముఖ్యంగా మధుమేహ వ్యాధిని చక్కగా నియంత్రిస్తుందని పేర్కొంటున్నారు.

గుండె వ్యాధుల నివారణ



ఫలాల్లో చెప్పుకోదగినవి అల్లనేరేడు పండ్లు. గుండె సంబంధిత వ్యాధులను నయం చేస్తాయి. రక్తపోటును నివారించడమే కాకుండా కాలేయ పని తీరును మెరుగుపరుస్తుంది. మోతాదుగా తింటే ఆహారం తేలికగా జీర్ణం అవుతుంది. అధిక మోతాదులో పండ్లను తింటే రోగనిరోధక శక్తి పెరగడంతో పాటు ఎముకలకు పరిష్టిని ఇస్తుంది. ఈ పండ్లు తింటే శరీరానికి చలువ చేస్తుంది. వేడి తగ్గుతుంది, డయాబెటిస్(మధుమేహ) రోగులకు ఇది చేసే మేలు ఎంతో. శరంలోని చక్కెరస్థాయి నియంత్రణలో ఉంటుంది.

–డాక్టర్ రాజు, సీతారాంపూర్

బీఆర్‌ఎస్ నాయకుల ఆరోపణలు సరికాదు



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కేశంపేట: కాంగ్రెస్ నాయకులపైన కొందరు బీఆర్‌ఎస్ నాయకులు చేస్తున్న ఆరోపణలు సరికాదని పార్టీ మండల అధ్యక్షుడు గూడ వీరేశ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో సీనియర్ నాయకుడు శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండల పరిధిలోని చింతకుంటపల్లిలో రైతు తన వ్యవసాయ భూమికి రోడ్డు కోసం కడీలను పాతుకుంటే దానికి కారణం కాంగ్రెస్ నాయకులే అంటూ బీఆర్‌ఎస్ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు చేస్తున్న ఆరోపణలకు ఆధారాలతో నిరూపించాలని వారు డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో గ్రామంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక పసలేని ఆరోపణాలతో కాలం వెల్లదీస్తున్నారని ఆరోపించారు. పది సంవత్సరాల కాలంలో గ్రామంలో నుంచి మట్టిని అక్రమంగా తరలించింది బీఆర్‌ఎస్ నాయకులేనన్నారు. పదేళ్ల కాలంగా రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉందని, అప్పుడు గ్రామానికి నక్షలేదనే విషయాన్ని మార్చిపోయారా అని విమర్శించారు. గ్రామానికి నక్షలేని విషయాన్ని ఎమ్మెల్యే అసెంబ్లీలో ప్రస్తావించారని, భూభారతితో సమస్యకు పరిష్కారం లభిస్తుందని వారు స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్ నాయకుల తప్పుడు ప్రచారాలను మానుకోవాలని హితువు పలికారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సురేశ్‌రెడ్డి, కర్ణాకర్‌రెడ్డి, హరీశ్వర్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు, నరేందర్‌రెడ్డి, మల్లేశ్ యాదవ్, చంద్రయ్య, బాలాజీ, లింగం, మహేశ్, షేరు, అజీమ్, సిద్ధయ్య, శేఖర్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

బీసీల హక్కుల సాధనకు పోరాటం

బీసీసేన మండల మహిళా అధ్యక్షురాలు జలజ



నూతన కమిటీ సభ్యులకు నియామకపత్రం అందజేస్తున్న జక్కుల జలజ

షాద్‌నగర్‌రూరల్: బీసీల హక్కుల సాధనకు బీసీసేన అలుపెరగని పోరాటం చేస్తుందని మండల మహిళా అధ్యక్షురాలు జక్కుల జలజ అన్నారు. శనివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కంసాన్‌పల్లి, బుచ్చిగూడ గ్రామాల్లో బీసీసేన మహిళా సమావేశాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు విద్య, ఉద్యోగ, ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో రాణించాలని సూచించారు. బీసీలకు జనాభా ధమాషా ప్రకారం రిజర్వేషన్లను అమలు చేసేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో బీసీ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదింపజేయాలన్నారు. అనంతరం నూతన మహిళా కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కంసాన్‌పల్లి నూతన కమిటీ అధ్యక్షురాలిగా శ్రీదేవి, ఉపాధ్యక్షురాలిగా అరుణ, ప్రధాన కార్యదర్శిగా రేవమ్మ, సహాయ కార్యదర్శిగా జహీదా, బుచ్చిగూడ నూతన కమిటీ అధ్యక్షురాలిగా సత్యమ్మ, ఉపాధ్యక్షురాలిగా మాధవి, ప్రధాన కార్యదర్శిగా స్వప్న, కార్యదర్శిగా లక్ష్మమ్మ, సహాయ కార్యదర్శిగా నాగలక్ష్మి, కోశాధికారిగా కృష్ణవేణిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లేడ్‌చౌదరిగూడ మండల మహిళా అధ్యక్షురాలు జయశ్రీకాంత్, ఉపాధ్యక్షురాలు ప్రవంతిరాజ్ పాల్గొన్నారు.

ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉపేందర్



సమావేశంలో పాల్గొన్న నాయకులు

కొందుర్గు: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉపేందర్ పిలుపునిచ్చారు. మండల అధ్యక్షుడు ఆనంద్ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని చిన్న ఎల్కిచర్లలో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశానికి ఉపేందర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ కోసం మందకృష్ణ మాదిగ నేతృత్వంలో మూడు దశాబ్దాలుగా రాజీలేని పోరాటం చేశామని గుర్తుచేశారు. ఈ పోరాటానికి అన్ని కులాల మద్దతు ఇచ్చారని, ఉద్యమానికి సహకరించిన ప్రతీ ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. జూలై 7న అన్ని గ్రామాల్లో ఆవిర్భావ వేడుకలు జరుపుకోవాలని, ఈ వేడుకల్లో అన్ని కులాల నాయకులను సత్కరించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు లింగం, ప్రవీన్, యాదయ్య, బాల్‌రాజ్, రమేశ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

‘తల్లికి వందనం’ను విజయవంతం చేయాలి



మొక్కలు నాటుతున్న నాయకులు

- మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం

చేవెళ్ల: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం అన్నారు. మండలంలోని కమ్మెట ఎక్స్ రోడ్డులో శనివారం బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్ ఆధ్వర్యంలో తల్లికి వందనం కార్యక్రమంలో భాగంగా ఆలయం ఎదుట మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంజర్ల ప్రకాశ్ మాట్లాడుతూ.. పర్యావరణాన్ని కాపాడుకునేందుకు ప్రధాని మోదీ ఈ కార్యక్రమానికి పిలుపునిచ్చారన్నారు. ప్రతి ఒక్కరూ తల్లికి వందనం చేసి ఆమె పేరుతో ఒక మొక్కను నాటాలని సూచించారు. పర్యావరణాన్ని మనం రక్షించుకుంటే అది మనల్ని కాపాడుతుందని గుర్తించాలన్నారు. కార్యక్రమంలో దిశా కమిటీ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి, జిల్లా కౌన్సిల్ మెంబర్ కుమార్, యువ నాయకులు డాక్టర్ మల్గారి వైభవ్‌రెడ్డి, శ్రీనివాస్, కృష్ణ, ఉమాశంకర్‌రెడ్డి, ధనుష్, కరుణాకర్, సందీప్, విష్ణువర్ధన్, మహేందర్‌రెడ్డి, మణికంఠ, నాగరాజు, శికుమార్ తదితరులు ఉన్నారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

షాద్‌నగర్‌రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని చౌ దమ్మగుట్ట ఆంజనేయ స్వామి దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా స్వామివారికి తెల్లవారుజాము నుంచి అభిషేకం, ప్రత్యేక పూజలు, పల్లకీసేవ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. పల్లకీ సేవలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనడంతో ఆలయ ఆవరణ కిటకిటలాడింది. అనంతరం ఆలయ అర్చకులు రఘుపతిరావు, రాఘవేంద్రచార్య, కృష్ణ, ప్రమోద్, సునీల్ పంతులు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. రియల్ ఎస్టేట్ మిత్రబృందం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

నష్టపరిహారం ఇప్పించాలని వినతి

షాద్‌నగర్: పట్టణంలోని మెయిన్ రోడ్డు విస్తరణలో భవనాలు కోల్పోతున్న వారికి ప్రభుత్వం నుంచి నష్టపరిహారం ఇప్పించాలని పలువురు వ్యాపారస్తులు, భవన యజమానులు శనివారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను కోరారు. రోడ్డు విస్తరణకు మున్సిపల్, ఆర్‌ఆండ్‌బీ అధికారులు చర్యలు చేపట్టిన నేపథ్యంలో వ్యాపారస్తులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వెళ్లి ఆయనతో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రోజురోజుకు పట్టణంలో జనాభా పెరుగుతోందని, ఫలితంగా ట్రాఫిక్ సమస్యతో అందరు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇందుకుగాను మెయిన్ రోడ్డును విస్తరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రోడ్డు విస్తరిస్తే భవిష్యత్తు తరాల వారికి ఎంతో ఉపయోగంగా ఉంటుందని, అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. అనంతరం పలువురు వ్యాపారస్తులు మాట్లాడుతూ.. రోడ్డు విస్తరణకు అందరం అంగీకరిస్తామని, అయితే భవనాలు కోల్పోయే వారికి ప్రభుత్వం నుంచి పరిహారం ఇప్పించాలని కోరారు. ప్రభుత్వంతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే వారికి హామీనిచ్చారు. కార్యక్రమంలో వ్యాపారస్తులు మోహన్‌రావు, సురేష్, శ్రీనివాస్, రఘు, రవి, ప్రభాకర్, నర్సింలు, ప్రకాశ్, ప్రవీణ్, శ్రీనివాస్, సుధాకర్, నర్సింలు, షంషీర్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న వ్యాపారస్తులు

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

- మాజీ మున్సిపల్ ఛైర్మన్ నరేందర్



పూజల్లో పాల్గొన్న నరేందర్, నాయకులు

షాద్‌నగర్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకొని మానసిక ప్రశాంతత పొందాలని మాజీ మున్సిపల్ ఛైర్మన్ కొందూటి నరేందర్ అన్నారు. శనివారం సంకటహర చతుర్థిని పురస్కరించుకొని పట్టణంలోని వినాయక గంజ్ ఆవరణలో ఉన్న గణపతి దేవాలయంలో సాయిమిత్ర యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు మలగారి సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో పయనించాలని, ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. అనంతరం వీహెచ్‌పీ నేత బండారి రమేశ్ భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మాధురి నందకిషోర్, నాయకులు వన్నాడ వెంకటేశ్‌గౌడ్, రఘుమారెడ్డి, నవీన్‌కుమార్, శేఖరప్ప, వెంకట్‌రెడ్డి, అభిలాశ్, శ్రీనివాస్‌గౌడ్, గోపాల్, శ్రీనివాస్, ప్రవీణ్, శేఖర్‌రెడ్డి, సుదీప్ తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య



మాట్లాడుతున్న జంగయ్య

కొత్తూరు: నల్లగుట్ట ప్రాంతంలో పోలీసులు చేపడుతున్న ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలిపివేస్తూ మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య కోరారు. ఇందులో భాగంగా మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన సీపీఐ గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయనతో పాటు జిల్లా నేత పర్వతాలు మాట్లాడుతూ.. సీపీఐ పార్టీ ఆవిర్భవించి వంద ఏళ్ల గడుస్తున్న సందర్భంగా శతాబ్ది ఉత్సవాలను నిర్వహించడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఉద్యమ పార్టీలతోనే దేశంలో ఉన్న పేదలు, కార్మికులు, రైతులకు న్యాయం జరిగిందన్నారు. కమ్యూనిస్టులు లేకపోతే దేశంలో భూస్వాములు, దళారులు ప్రజలను దోచుకొని అనేక రకాలుగా ఇబ్బందులకు గురిచేసేవారని వివరించారు. కమ్యూనిస్టులు ఎప్పటికీ సమాజ అభివృద్ధి, పేద ప్రజల శ్రేయస్సు కోసమే కృషి చేస్తారన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి షకీల్, నాయకులు సంజీవకుమార్, జంగయ్య, అజ్మత్ అలీ, ఎల్లయ్య, దేవమ్మ, రోజా, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు జంగయ్య

కొందుర్గు: అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బుద్దుల జంగయ్య డిమాండ్ చేశారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని చెన్నారెడ్డిగూడలో శనివారం ఏర్పాటు చేసిన సీపీఐ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఉపాధి కూలీలలకు ఏడాదికి రూ.12వేలు ఇస్తామని హామీ ఇచ్చి మరిచిపోయిందన్నారు. పేదలు డబ్బులు లేకనే ఇళ్లు కట్టుకోవడం లేదని, లబ్ధిదారులు ఇల్లు కట్టుకున్నాక విడతల వారీగా బిల్లులు ఇస్తామనడం సబబు కాదన్నారు. ముందుగా లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు వేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు లింగం, రాజు, జంగయ్య, చంద్రయ్య, రమేశ్, భీమయ్య పాల్గొన్నారు.

జోరందుకున్న వ్యవసాయ పనులు



మక్తగూడలో అచ్చుకొడుతున్న రైతు



తిమ్మారెడ్డిగూడలో విత్తనాలు విత్తుతున్న రైతులు

రెండు రోజుల నుంచి చిరుజల్లులు పడటంతో వ్యవసాయ పనులు జోరందుకున్నాయి. దుక్కులు దున్నడం, విత్తనాలు విత్తడం పనుల్లో రైతులు బిజీ బిజీగా మారారు. విత్తనం విత్తుకోవడానికి మృగశిరకార్తె అనువైనదని వారి నమ్మకం. దీంతో రైతులు విస్తారంగా విత్తనాలు విత్తుతున్నారు. మండలంలో పలు గ్రామాల్లో రైతులు విత్తనాలు విత్తే పనుల్లో నిమగ్నమయ్యారు. కొంత మంది రైతులు దుక్కులు దున్ని చదును చేస్తున్నారు.

– షాబాద్